క్లుప్తంగా

మొండి బకాయిదారులపై చర్యలు తీసుకుంటాం

చొప్పదండి: పన్నులు చెల్లించకుండా మొండిగా వ్యవహరించే బకాయిదారుల నల్లా కనెక్షన్లు తొలగించి సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు హెచ్చరించారు. బుధవారం పన్నుల వసూలుపై మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్తి, నీటి పన్ను, లైసెన్స్ ఫీజు, ఇతర పన్నులు వందశాతం వసూలు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం ఆస్తులు జప్తు చేయడం, చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉందని, ఈ నెల 31 లోగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులు పూర్తిగా చెల్లించాలని కోరారు. రెవెన్యూ రికవరీ చట్టం–1864 ప్రకారం బకాయిదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ. 7,150



వేలంలో పాల్గొన్న వ్యాపారులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి గరిష్టంగా రూ.7,150 ధర పలికింది. బుధవారం మార్కెట్‌కు ఐదు వాహనాలలో 107 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. క్వింటాల్‌కు మోడల్ ధర రూ.7,050, కనిష్ట ధర రూ.6,000 ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. పత్తి క్రయ విక్రయాలను ఉన్నత శ్రేణి కార్యదర్శి మల్లేశం, గ్రేడ్–2 కార్యదర్శి రాజా పర్యవేక్షించారు.

ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్

చొప్పదండి: మండలంలోని చాకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం కలికోట తిరుమల్ ఆధ్వర్యంలో హిందీ టీచర్ ఫాతిమ విద్యార్థులతో తయారు చేయించిన హర్యానా రాష్ట్ర సంస్కృతి చిత్రపటాలు, ఉపకరణాల మేళా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఫిజికల్ సైన్స్ టీచర్ విద్యాసాగర్, కరుణాకర్, బాలరెడ్డి, జంపాల వనిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై చిన్నచూపు

హుజూరాబాద్: ప్రభుత్వం విద్యారంగంపై చిన్నచూపు చూస్తోందని, ప్రస్తుత బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.ఇరవై వేలకుపైగా కోట్లు కేటాయించి అన్యాయం చేసిందని మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన బీసీ ఆజాదీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పంజాల రేవంత్ బుధవారం ప్రకటనలో ఆరోపించారు. వెంటనే బడ్జెట్‌ను సవరించి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

అగ్రవర్ణ పేదలకు పథకం వర్తింపజేయాలి

చొప్పదండి: రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అగ్రవర్ణ పేదలకు వర్తింపజేయాలని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ... నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం పథకం ప్రవేశపెట్టడం అభినందనీయమని, అదే సమయంలో అగ్రవర్ణాల్లోని నిరుపేదలను గుర్తించాలని విన్నవించారు. ప్రభుత్వ పథకాలు అందక అన్యాయానికి గురవుతున్నారని, నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

25న వేలం

జమ్మికుంట: మండలంలోని శంభునిపల్లి గ్రామంలో శనివారం, నాగంపేటలో మంగళవారం నిర్వహించే మేకలు, గొర్రెల అంగడి వేలం 25న నిర్వహించనున్నట్లు శంభునిపల్లి కార్యదర్శి ఇంగె కిషన్, నాగంపేట కార్యదర్శి అంకూస్‌లు బుధవారం ప్రకటనలో తెలిపారు. శంభునిపల్లి అంగడివేలంలో పాల్గొనేందుకు 22వ తేదీ వరకు రూ.20 వేల డీడీ, నాగంపేట అంగడి వేలంలో పాల్గొనేందుకు 24వ తేదీ వరకు రూ.50వేల డీడీ అందజేసినవారు అర్హులని, ఆసక్తి గలవారు పూర్తి వివరాల కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయం, కార్యదర్శులను సంప్రదించాలని పేర్కొన్నారు.

నాయకుల సంబరాలు

గంగాధర: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ, శాసనమండలి ఆమోదం తెలపడంతో మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం మధురానగర్ చౌరస్తాలో సంబరాలు జరుపుకున్నారు. వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం చేసిన మందకృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సైదాపూర్: మండల కేంద్రంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. 30 ఏళ్ల పాటు మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం దక్కిందన్నారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శంకరపట్నం: కన్నాపూర్‌లో ఉపాధ్యాయులతో విద్యార్థులు



శంకరపట్నం: డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు పలికారు. విద్యార్థులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని టీచర్లు సూచించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మానకొండూర్‌రూరల్: పదోతరగతి పరీక్షలో మంచి మార్కులు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని అమ్మఆదర్శ పాఠశాల చైర్మెన్ పాముల సౌజన్య అన్నారు. బుధవారం మండలంలోని వెల్ది జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ అనుకున్న లక్ష్యం చేరుకోవాలన్నారు. అనంతరం తన భర్త జ్ఞాపకార్థం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి

హుజూరాబాద్: మామిడి తోటల నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని హుజూరాబాద్ ఉద్యానశాఖాధికారి మంజువాణి అన్నారు. మండలంలో ఆయా గ్రామాల్లోని మామిడి తోటలను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో భూమి తేమగా ఉండటానికి ఉదయం, సాయంత్రం డ్రిప్ ద్వారా నీరు అందించాలన్నారు. పదేళ్ల పైబడిన తోటల్లో మొక్కలు, కాయల ఎదుగుదలకు, చీడపీడల నివారణకు సూచించిన మందులు పిచికారీ చేయాలన్నారు. వాతావరణ మార్పులు ఎదుర్కోవడానికి క్రమం తప్పకుండా డ్రిప్ ద్వారా నీరు అందించాలన్నారు. అలాగే రైతులు వివిధ సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జమ్మికుంట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని హనుమకొండ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రమౌళి అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతీయ సాహిత్యంలో పర్యావరణ రూపకల్పనపై నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో మాట్లాడారు. పర్యావరణంపై అందరికీ అవగాహన కల్పించాలని పలువురి రచనలపై చర్చించారు. వివిధ జిల్లాల నుంచి 50 మంది రచనలు సమర్పించారు. ప్రిన్సిపల్ రమేశ్, కన్వీనర్ ఓవెల్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామల, రాజేంద్రం,గణేష్, అధ్యాపకులు కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి,



మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రమౌళి

రవీందర్, రవిప్రకాశ్, సుష్మ, శ్రీను, సాయికుమార్,ప్రశాంత్, రమేష్, వివిధ కళాశాలల బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల సవాళ్లు

తిమ్మాపూర్: మానకొండూరు ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కొంతకాలంగా విమర్శలు గుప్పిస్తున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో దాదాపు రూ.6 కోట్ల మేర అవకతవకలు జరిగాయని రసమయి తిమ్మాపూర్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు జోరుగా సాగుతున్నాయి. ఈనేపథ్యంలో బెజ్జంకి మండలంలోని గుండారం వద్దకు బహిరంగ చర్చకు రమ్మని సవాల్ కాంగ్రెస్ నేతలు రసమయికి సవాల్ విసిరారు. బుధవారం ఉదయం కాంగ్రెస్ నాయకులు బెజ్జంకి వైపు బయలుదేరగా బహిరంగ చర్చ పేరుతో గుండారంలోని రసమయి బాలకిషన్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంపై దాడి జరిగే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు అడ్డుకున్నారు. ఆయా మండలాల్లోని కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. తిమ్మాపూర్ మండలంలో



నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కొందరిని ఉదయం అదుపులోకి తీసుకోగా మరికొందరు తప్పించుకునే ప్రయత్నంలో రేణికుంట టోల్‌గేట్ వద్ద పోలీసులకు చిక్కారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నాయకులు నుస్తులాపూర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే దిష్టి బొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి చేసే అవకాశం ఉందని భావించిన పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏం జరుగుతోందని ప్రజలు చర్చించుకున్నారు.

27న హుండీ ఆదాయం లెక్కింపు



మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని ఈ నెల 27న నిర్వహించనున్నామని ఆలయ ఈవో మారుతి తెలిపారు. ఆసక్తి గలవారు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొనాలన్నారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం రూ.8,13050

తిమ్మాపూర్: మండలంలో నల్లగొండ శ్రీసీతారామ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ హుండీల ఆదాయ లెక్కింపు ఈవో అనిల్ కుమార్, ఉత్సవ కమిటీ చెర్మన్ బండారిపల్లి లక్ష్మణ్ సమక్షంలో నిర్వహించారు. స్వామివారికి భక్తులు సమర్పించిన కట్నకానుల ద్వారా రూ.8,13,050 ఆదాయం వచ్చిందన్నారు. మొత్తం రూ.16,82,760 ఆదాయంతోపాటు మిశ్రమ బంగారం రెండు గ్రాములు, మిశ్రమ వెండి 120 గ్రాములు భక్తులు సమర్పించారని, గతేడాది కంటే ఈ సంవత్సరం అధిక ఆదాయం వచ్చిందన్నారు. ఈసారి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చకులు రాముశర్మ, లక్ష్మణ్ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్నిరకాల వసతులు కల్పించామన్నారు. దేవాలయాన్ని అభివృద్ధి చేస్తే ప్రభుత్వానికి మరింత ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ, డైరెక్టర్లు గాజుల అంజయ్య, బూత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మీరాజం, జింక శ్రీనివాస్, కవ్వంపల్లి మహేశ్, గోలి లక్ష్మీనరసయ్య, మార్క నరసయ్య పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

మానకొండూర్: మండలంలోని వన్నారం గ్రామం నుంచి గంగిపల్లి గ్రామం మల్లికార్జున స్వామి ఆలయం వరకు సీసీరోడ్డు నిర్మాణ పనులను వన్నారం గ్రామస్తులు బుధవారం ప్రారంభించారు. ఉపాధిహామీ నుంచి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని మాజీ ఉపసర్పంచ్ బుద్దుల తిరుపతిని గ్రామస్తులు కోరారు. మండలంలోని చెంజర్ల దేవునిగుట్టపై రంగనాయక స్వామి, శివాలయం వరకూ సీసీరోడ్డు నిర్మాణ పనులను గ్రామస్తులు ప్రారంభించారు. కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిధులు మంజూరు చేయించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామ ఎనిమిదో వార్డులో రూ.ఐదు లక్షల విలువ గల సీసీ రోడ్డు పనులకు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రమణయ్య, మాజీ సర్పంచ్ రమేశ్, పీఆర్ ఏ.ఈ.నిరంజన్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ కోమలచంద్రమౌళి, పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

కళ్లద్దాలు అందజేత



కళ్లద్దాలు పరిశీలిస్తున్న వైద్యాధికారి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం మోడల్ స్కూల్ విద్యార్థులకు బుధవారం వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ కళ్లద్దాలు అందజేశారు. గతంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 30 మంది కంటి సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు.

పరీక్ష సామగ్రి..

చొప్పదండి: తెలంగాణ శ్రీనివాసుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గుమ్లాపూర్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం పెన్నులు, ప్యాడులు అందించారు. గ్రామంలో శ్రీనివాస్ అనే పేరుగల వ్యక్తులు సమావేశమై సేవా కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

హుజూరాబాద్: పది పరీక్షలు రాయనున్న మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రవాణా భత్యం కింద ఆర్థికసాయం అందజేసే కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జయపాల్‌రెడ్డి బుధవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం సమర్పించారు. పరీక్షలు జరిగే రోజులను పరిగణనలోకి తీసుకొని మొత్తం 275 మంది విద్యార్థులకు రూ.1,92,500 అందజేయనున్నామని, ఇప్పటికే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు అందజేశామని తెలిపారు.

తుమ్మచెట్ల నరికివేత



శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ గ్రామంలో బుధవారం అక్రమంగా తుమ్మ చెట్లను నరికివేశారు. గ్రామపంచాయతీ అధికారులకు తెలియకుండా వారి అనుమతి లేకుండా కొత్తకుంట కట్టపై ఉన్న ఐదు చెట్లను యంత్రంతో కోయించిన ఓ సామాజిక వర్గం సుమారు రూ.లక్షన్నరకు విక్రయించినట్టు ప్రచారం జరుగుతోంది. సమాచారం అందుకున్న ఎంపీడీవో కృష్ణప్రసాద్ గ్రామకార్యదర్శితో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా అక్రమంగా చెట్లు నరికివేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కోళ్లను ఎత్తుకెళ్లిన దొంగలు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ కన్నాపూర్ గ్రామానికి చెందిన రజాక్ చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున చికెన్ సెంటర్ వద్దకు వెళ్లగా జాలీలో కోళ్లు కనిపించలేదు. దొంగలు జాలీ తాళం పగులగొట్టి కోళ్లను ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో నెమలిమృతి



తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ శివారులో ఎల్ఎండీ రిజర్వాయర్ పరిసర ప్రాంతంలో జాతీయ పక్షి నెమలి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బుధవారం సాయంత్రం గ్రామానికి చెందిన కవ్వంపల్లి అంజయ్య మృతిచెందిన నెమలిని గమనించి ఫారెస్ట్ బీట్ అధికారులకు సమాచారం అందించాడు. మృతిచెందిన ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఎగిరే క్రమంలో వైర్లు తగిలి మృతిచెంది ఉంటుందని అధికారులు తెలిపారు.

వీధికుక్కల దాడిలో ఒకరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో బుధవారం వీధి కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించి చికిత్స చేయించినట్టు స్థానికులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో ఇటీవల గుండె పోటుతో మృతిచెందిన గోవర్దన్ కుటుంబాన్ని బుధవారం స్నేహితులు పరామర్శించారు. అనంతరం 1987–88 ఎస్సెస్సీ విద్యార్థులు గోవర్దన్ కుటుంబానికి రూ.ఇరవై వేలు అందించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

హుజూరాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం దక్కడంతో బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

జమ్మికుంట: బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు అసెంబ్లీలో ఆమోదం దక్కడంతో పట్టణంలోని అంబేడ్కర్, గాంధీచౌక్ ఏరియాల్లో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు.

శంకరపట్నం: అసెంబ్లీలో బీసీ, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం దక్కడంతో మండలంలోని కేశవపట్నంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్,పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ క్షీరాభిషేకం చేశారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌స్పోర్ట్స్/తిమ్మాపూర్: కరీంనగర్ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవం ఉత్సాహంగా సాగింది. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. విద్యార్థి దశలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ వెంకట రాంబాబు మాట్లాడుతూ జిల్లాస్థాయి యువజనోత్సవంలో 350మంది విద్యార్థులు వివిధ రకాల పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. చిత్రలేఖనం, కవిత్వం వంటి పోటీల్లోని విజేతలకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. వాగేశ్వరి విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రకాశ్‌రెడ్డి, సాయినాథ్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ముందస్తు బడిబాట

మానకొండూర్‌రూరల్: మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి బుధవారం గ్రామంలో ముందస్తు బడిబాట నిర్వహించారు. వీధుల గుండా తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం చేశారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన లభిస్తోందని, ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులను కూడా ప్రారంభిస్తామన్నారు. గ్రామం నుంచి సుమారుగా 56 మంది ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారని అందరు ప్రభుత్వ పాఠశాలకు రావాలని కోరారు. హెచ్ఎం శ్రీనివాస్‌జీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండిన పంటలను పరిశీలించిన నాయకులు



లంబాడిపల్లిలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చిగురుమామిడి: మండలంలోని లంబాడిపల్లె, గాగిరెడ్డిపల్లి, సీతారాంపూర్ గ్రామాల్లో సాగునీరందక ఎండిన వరి, మొక్కజొన్న పంటలను సీపీఐ నాయకులు బుధవారం పరిశీలించారు. సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎండి పంటలపై వ్యవసాయ శాఖ అధికారులతో సర్వేచేయించి పరిహారం అందించాలని కోరారు. ఎండిన పంటలను పరిశీలించిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, నాయకులు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, ఎనగందుల రాజయ్య, మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి, అందె చిన్నస్వామి ఉన్నారు. అలాగే చందబోయిన బాలయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు.

బాలల పరిరక్షణపై అవగాహన



అవగాహన సమావేశంలో అధికారులు

చొప్పదండి: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బాలల పరిరక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బాలల సంక్షేమ కమిటీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ఆధ్వర్యంలో బాలబాలికలు ఎదుర్కొనే సమస్యలపై తహసీల్దార్ నవీన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో బాలబాలికల వివిధ సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఏసీడీపీవో నర్సింగరాణి, ఎంపీడీవో వేణుగోపాల్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మల్లన్న పట్నాలు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో ఏగుర్ల ఆంజనేయులు, బక్కయ్యలకు సంబంధించిన 50 కుటుంబాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లన్న పట్నాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఐదేళ్లకోసారి వేసే మల్లన్న పట్నాల్లో భాగంగా బుధవారం ఒగ్గుపూజారులు సాయిల్ల శివయ్య, సింగారయ్య, మల్లేశం ఆధ్వర్యంలో ఉదయం ఐదు రంగులతో ఆకర్షణీయంగా లగ్నం పట్నం వేశారు. అనంతరం మల్లన్నతో గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మకు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం నాగవెల్లి పట్నం వేసి మల్లన్న ఒగ్గుకథను కళాకారులు ప్రదర్శించారు. కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ పట్నాలను సందర్శించారు. రుక్మాపూర్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన ఏగుర్ల వంశస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మల్లన్న పట్నాల్లో పాల్గొన్నారు.